
# ముక్కుపుడక

"అది మా లగ్గమైన తొలి రేత్తిరే ముక్కుపుడక సేయిత్తానని మాటిత్తేనే మంచం ముట్టింది. ఎంతైనా మావ కూతురే గందా ... బింకంబోయింది!

"మోహానంటే మజాకా ఏటి? మనసెరిగి మురిపిచ్చాను. ఓసోస్! అదేం బాగ్గెం ... నిత్తెం బైర్సెప్పులకు బేరం దగిల్నా, దేవుడి దయతో పదిమందికి ఉంగటాలు దెగినా, తొల్సారి కానుపుకల్లా ముక్కుపుడక దేనూ ... అన్నాంకనే అది నిప్పుగాల్న మైనం(మై మీదొలికింది! ఏడెట్టింది! మంచం ముట్టింది!

"అట్టా తొలిపాలి పబ్బం గడిసి, మా పెద్దోడు ఆరెతో వారుగోసెంతైనా, సిన్నోడు సిల్మా బండెనకాల్నే లగువెత్తేంతైనా పాపం ... దానికి ముక్కుపుడక అవిర్తేనా ...



గోపరాజు నాగేశ్వరరావు

"ఏలెడ్లేదు, మా గుంటముండది ఎక్కాల బుక్కు గావాల్నని గుక్కెట్టి ఏడుస్తాంటే 'గురువు లేని యిద్దెందుకే గుంటదానా ... బళ్లో జేర్పినాక కొంటాడ్లే మీ అయ్య' అని దాన్ని సవర్దియ్యనే నిత్తెం సరిపోతుంటే ఇంక నా దానికి ముక్కుపుడకమీద భ్రమేంటి కుంటుంది? భ్రమను సంపుకునే వుంటాది!

"ఈ యోహానే గాదు, పేదోడెవ్వడూ పండ్లాం కోర్కెలు దీర్పలేడన్నదే దిల్దారుమాట!"

"అంతేనంటావా?" చెప్పుల రిపేరు కింకా టైం పడుతుందని చెట్టు నీడనే తాపీగా కూర్చుంటూ అడిగాడు యంకటేశర్లు.

యంకటేశర్లు చెప్పుల్ని దుమ్మొదిలేదాకా గుండ్రాయిమీద కొట్టి సహం ఊడిన అడుగుల్ని ఆసాంతం పీకి, పై ముక్క అడుగునా, కింది ముక్క పైనా యిసిక్కాయితంతో రుద్దుతూ

"అంతే మరి! యీ సింసెట్టుకిందే మా అయ్యగూడా సెప్పులే గుట్టాడు. ఒంగి, సెప్పులు గుట్టీ గుట్టీ గూనోడైండు గానీ గుడిసెన్నా గట్టలేదు. సొంత గుడిసెమీద భ్రమతో అమ్మ సచ్చింది. అమ్మమీద భ్రమతో అయ్యా సచ్చాడు.

మరి, అయ్య ఆరె, కంటాని, దారబ్బంతి, టైరు ముక్కలు, అయ్య దాపెట్టుకునే కాకిసంచి, కూకొని సెప్పులు గుట్టే గోనెపట్టా, సట్టం ప్రెకారం నాయే! ఏం జేస్తాం ... అప్ప అడ్డం దిరిగింది. ప్రెభుత్తం మారిందంట. సట్టం మారిందంట. పేదోళ్లకూ, ముఖ్యెంగా ఆడోళ్లకూ ఆదరువు సూపిచ్చే కొత్త సట్టం వొచ్చిందంట. ఆ కొత్త సట్టం ప్రెకారం ఆరె నాదైతే కంటాని దాన్దంట. దారబ్బంతి నాదైతే కాకి సంచి దాన్దంట. గోనెపట్టా నాదైతే నే గూకునే సింసెట్టు దాన్దంట...

దేవుడిచ్చిన నల్లకాడే రాత్రాలూ రాత్రాలూ గొట్టుకుంటుంటే ఇంక అయ్యిచ్చిన ఆస్తికాడ మేం మాత్తరం గొట్టుకోమా? కొట్టుకున్నామంతే! పోలీసోళ్లొచ్చి అప్పకాడ యాభై, నాకాడ యాభై నూకి మా ఇద్దర్నీ దెయ్యాల కోర్టుకు బెట్టారు..."

"దెయ్యాల కోర్టా?" ఆశ్చర్యంగా చూసేడు యంకటేశర్లు.

"ఆఁ... మరి! కోర్టు బెట్టిన ఆ పాడుబడ్డ బంగళాలో దెయ్యం ఉందంట! అందుకే దాన్ని దెయ్యాల కోర్టంటారంట!" అని వివరణ ఇచ్చి, మరింత వేగంగా ఇసిక్కాయితంతో చెప్పు అడుగుల్ని రుద్దుతూ


"దర్మం యాడైనా దర్మమే! ఆడ దెయ్యాలుంటే యేం, దేవుళ్లుంటే యేం నికార్సయిన దర్మం సెప్పారు! అప్ప అడిగిన కంటాని, కాకి సంచి అప్పకిత్తే, వుట్టి ఆరె, దారబ్బంతి, గోనెపట్టాతో యోహాన్నైన నేను సెప్పులు గుట్టే యాపారం జెయ్యలేననీ, అంసొత సట్టాన్ని సొటుకి బెట్టి మానవొత్తం ప్రెకారం అయ్యన్నీ నాకే సందాలనీ తీర్పిచ్చారు. ఇంక సింసెట్టు యిసయంలో ఆ సెట్టు అప్పదీ గాదు, నాదీ గాదనీ అది ప్రెబుత్వాన్దనీ, అయినా మానవొత్తం ప్రెకారం అది వంశపారంపరియంగా మా ఆక్రమణలోనే వుంది గనక యోహాన్నైన నా ఆక్రమణే సెల్లుద్దన్నారు. అట్టా ఎట్టా సెల్లుద్దో సెబుతూ వొంసెపారంపరియం అన్నది దేవుడి ముడుపసువంటిదనీ, అది సెల్లాల్సినోడికే సెల్లుద్ది గానీ మద్దెనోళ్లకు సెల్లదనీ, మానవొత్తం ప్రెకారం ఆదికాలం నించి సీసిరి పోతులూరి ఈరబ్రెమ్మంగోరు సెప్పినట్టు ఆన! కలి అంతం ... ఈరబోగ వొసంతరాయుడు జల్మించేవరకూ వొంసె పారంపరియంగా రాజు కొడుకు రాజు, మంత్రి కొడుకు మంతిరి, ఎంపీ కొడుకు ఎంపీ, ఎంఎల్లే కొడుకు ఎంఎల్లే, సిల్మా యాకటేరు కొడుకు యాకటేరు, డాకటేరు కొడుకు డాకటేరు, రుక్షావోడి కొడుకు రుక్షావోడూ ...

అంశాత దర్మం ప్రెకారం సింసెట్టు నాదే అన్నారంతే, అప్పుడు సూడాలె మా అప్ప మొకం! వొడిలిన ఇప్పపువ్వయింది. అయినా కోరుటన్నాక దర్మం దర్మమే! ఎసుమంటోళ్లయినా యినితీరాలి మరి!

మలిమికి, దెయ్యాల కోర్టు దర్మప్రెబువు ఇంకా అన్నాడు గదా సట్టాన్ని సొటుకుబెట్టి మానవొత్తం ప్రెకారం అప్ప అప్పేననీ, అప్ప మొగుడు బావేననీ, వాళ్లు ఆరె, కంటాని, దారబ్బంతి, కాకిసంచి, గోనెపట్టా, సింసెట్టూ అన్నీ వొదులుకోవాలి గనక మానవొత్తం ప్రెకారం అప్పకూ, బావకూ నే కొత్త సెప్పులు గొనిపెట్టాలని తీర్పిచ్చారు. ఆ సెప్పులు గూడా నేన్జేసే టైర్సెప్పులు గావనీ, బాటా కంపిణీవే గొనిపెట్టాలనీ ఆడరీ యేసేరు.

దర్మప్రెబువా! అయ్యిచ్చిన ఆస్తంతా అమ్మినా గాని తవరి ఆడరీ ప్రెకారం కంపిణీ సెప్పుల్రావని సెబ్దామంటే ప్రెబువే అన్నారు గదా, ఆడరీ ప్రెకారం అప్పకు ఆర్రోజుల్లోగా, బావకు నెలరోజుల్లోగా సెప్పులు గొనిపెట్టకపోతే యోహాన్నైన నాకు ఆర్నెల్ల కటిన కారాగార శిచ్చంట!

అప్పుడు సూడాలె నా మొకం!



ఆ కుటుంబం చిరునామా ఆనందం అన్నట్టుందికదూ ఈ ఫొటో చూస్తుంటే. వారిద్దరు వారి ఏకైక సంతానం సౌమ్యతో ఎంతో సంతోషంతో చిరునవ్వులు విరబూయిస్తున్నారు. ఈ ఫొటోలోని నాయుడి కుటుంబాన్ని చూస్తే ఎవరికైనా ఈర్ష్య కలగకమానదు. నాయుడు దంపతులకు కూతురుంటే పంచప్రాణాలు. ఆమె ప్రతి కదలిక వారికి ఎంతో మురిపెం. ఈ కుటుంబంగురించిన మరిన్ని వివరాలకై రెండవ ఫొటో చూడండి.

కోర్టులో అయ్య ఆస్తి గెల్సుకున్న నా మొకం సాదా బైర్సెప్పైతే కేసోడిపోయిన మా అప్ప మొకం ఇస్పెసల్ కంపెణీ సెప్పైంది!

అయినా కోర్టన్నాక దర్మం దర్మమే గదా, ఎసుమంటోళ్లయినా ఇన్త్రీరాలె మరి!

నాదానికి ముక్కుపుడక గొందామని దాపెట్టిన సిల్లరంతా పోగేసి దర్మప్రెబువు ఆడరీ ప్రెకారం అప్పకూ, బావకూ కొత్త సెప్పులు గొనిచ్చి జేలు శిచ్చ తప్పిచ్చుకున్నాను!" అన్నాడు యోహాను, చెప్పుముక్కలకు సొల్యూషన్ రాస్తూ.

చెట్టుకింద నీడ చోటు మారింది. యోహానుమీదికి ఎండపొడొచ్చింది. పొద్దు గడిచేకొద్దీ అలా చెట్టు చుట్టూ జరుగుతూ ఎండను తప్పించుకోవాలి. జరిగేడు. నీడలో కూర్చున్నాడు.

యంకటేశర్లు కూడా నీడలోకి జరిగి కూర్చుని "అట్టా నీ భార్య ముక్కుపుడక ప్రయత్నం మురిగిపోయిందన్నమాట!" అని అవసరానికి మించిన దిగులు గాలిని నోటితో వూది, నిట్టూరుస్తూ తన చెప్పు అడుగులకేసి చూపు గుచ్చేడు. అవ్వింకా ఆర్లేదు.

ఉబుసుపోనప్పుడే సత్కార్యాలు గుర్తొస్తాయి కనుక యోహాను వేపుకు మహిమగల స్వామికి మల్లే చూస్తూ, "నీ ముక్కుపుడక సమస్యకో చక్కటి ఉపాయం చెప్తానోయ్ యోహానూ...!" అని దీర్ఘం తీసేడు యంకటేశర్లు.

ఉంగటాల జతను గుండ్రాయిమీద తడిపెట్టి, రైలుపట్టాల బోల్టుతో పొడిచిపొడిచి వంకర తీస్తోన్న యోహాను పని కట్టిపెట్టి తొండలా తలెత్తి చూసేడు.

మెరుపు కళ్లతో యంకటేశర్లే అన్నాడు "మనకి మళ్లీ ఎలక్షన్లొస్తున్నాయి యోహానూ ..." అని. ఆ సువార్త యోహానుకు చెప్పేప్పుడు అతగాడి ముఖం పుష్కరాల కరెంటు దీపంలా వెల్తురు పువ్వు పూసింది!

"మళ్లీ ఎలచ్చునేంటి? ఈ మద్దెగాలేగా జర్గింది?" తేలుకొండె ముఖంపెట్టి అడిగేడు యోహాను.

"పార్లమెంటు రద్దయింది. మధ్యంతర ఎన్నికలొచ్చాయ్!" అని, వరల్డ్ కప్పు గెలుచుకున్న కపిల్‌దేవ్‌లా ఆనందంగా నవ్వాడు యంకటేశర్లు.

"ఎట్టెట్టా?"

"అవును! పార్లమెంటు మనుషులకు సుతి కుదర్లేదట. సుతి కుదరాలంటే మతి కుదరాలిగా? ఐదొందలమంది పార్లమెంటు మనుషులకి సుతి, మతి కుదర్నప్పుడల్లా శతకోటి భారతీయులకు ఓట్ల పండగొస్తుంది!" నమ్మకంగా చెప్పాడు యంకటేశర్లు.

"మరి, ఓట్ల పండక్కీ, నాదాని ముక్కుపుడక్కీ ఏటి సమ్మందం?"

"శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు! ఓట్ల పండక్కీ నీ భార్య ముక్కుపుడక్కీ సంబంధం ఏంటో ఆనక నేనే చెప్తానుగా ..." అన్నాడు యంకటేశర్లు ఆయుర్వేద బిషక్కులా గూఢంగా.

ఎలక్షన్లను యంకటేశర్లు ఓట్ల పండగని ఎందుకు అన్నాడో యోహానుకు అర్థం కాలేదు. తొండకు మల్లే ధ్యానంగా చూస్తూ కూర్చుని, క్షణం తర్వాత...


"కలోరి పెళ్లి బోజనాల కాడ కాకుల గోలంట! అయినా ఎలచ్చున్లతో బక్కోళ్లకు మనకేంటి సమ్మందం? ఆ సమ్మందం వుండే మడుసులే యేరు. వాళ్లు చలవ పెట్టెలు బిగ్గొట్టిన మేడల్లో వుంటారు. ఇగదేశాలకు ఎగుమత్జేసే బెంగులూరు గులాబి పువ్వుల్లాగుంటారు. పడవలంత కార్లలోనే దిరుగుతుంటారు. ఎలచ్చున్ల పోటీ జర్గేది వాళ్లల్లో వాళ్లకే! ఓట్లెక్కువేసుకున్నోడు పదవిలోకెల్తాడు. ఓడిపోయినోడు ఊళ్లోనే వుంటాడు. గెల్సినోడు డిల్లికో, అయిద్రాబాదుకో ఎల్తాడు. ఆడ వాడేం జేస్తాడో మనకేం తెలవదు. ఈడ మనఁవేం సెయ్యాలో మనలకు తెలవదు. మనకేటి సెయ్యాలో వాడికి తెలవదు. అసుమంటప్పుడు అసలు ఎలచ్చునైతేనేం, నడమంతరపు ఎలచ్చునైతేనేం, మనకేటి సమ్మందం?" నిర్వికారంగా చూస్తూ అడిగేడు యోహాను.

యంకటేశర్లు ఉలిక్కిపడ్డాడు. "యోహానూ! నువ్వు మాట తేడా పడ్డావోయ్, వాట్ని నడమంతరపు ఎన్నికలనరు. మధ్యంతర ... మధ్యంతర ఎన్నికలంటారు!" అని యోహాను పొరపాట్ను సవరించాడు యంకటేశర్లు.

"సదూకున్నోళ్లు గనక సక్కంగ సెప్తారు. సదూకోనోడ్ని గదా మాట తేడాబడ్డాను!" అని, తన అజ్ఞానానికో, యంకటేశర్లు జ్ఞానానికోగానీ మొత్తానికి నొచ్చుకున్నాడు యోహాను!

యోహానుకు ప్రజాస్వామ్యంలో బతకటం తెలీదన్న విషయం యంకటేశర్లుకు తెలిసిపోయింది. జాలిగా చూస్తూ "నువ్వొట్టి అమాయకుడివోయ్ యోహానూ! నీ పెళ్లయిం తర్వాతనే పది ఎలక్షన్లు జరిగేయి. వంద స్కాములు జరిగాయి. యాభై సంవత్సరాల స్వతంత్రానికి స్వర్ణోత్సవం జరిగింది. సంబరంగా పెద్దోళ్లు వందల కోట్లలో దేశాన్ని దోస్తోంటే చిన్నోడివి వందల్లో ఐనా దోచుకోవొద్దూ ... ఎలక్షన్లొస్తేనే పెద్దోళ్లు చిన్నోళ్లకు చిల్లర విసిరేసేది. అయినా నువ్వు కోరేది తుపాకులమ్మి కోట్లు మింగాలనా, పశువుల నోటి దగ్గరి దాణా మింగాలనా, ఎరువుల్ని ఎగరేసుకుపోవాలనా, బాంకుల్లో డబ్బుకూ, కోర్టుల్లో న్యాయానికీ బెజ్జం వెయ్యాలనా ... కేవలం పెళ్లానికి ముక్కుపుడకేగా?" అని ఊపిరి పీల్చుకుని...

"అట్టయితే యోహానూ! వచ్చే మధ్యంతర ఎన్నికల్లో నువ్వే డబ్బున్న పార్టీకి క్రియాశీల కార్యకర్తవైపో! నువ్వు 'సై' అంటే పోటీచేసే సార్తో నేను మాట్లాడ్తాను. కొండ కట్టెలూ, కోనేటి నీళ్లూ తెచ్చే పనేం లేదు! నువ్వు చెయ్యాల్సిందల్లా గూడెం వాళ్లకు కడుపులో చుక్కేయించు. క్యూలో నీలబెట్టు. చేతివేలి మీద చుక్కేయించి, వాళ్లిచ్చే ఓటు కాయితంమీద మేం చెప్పే గుర్తుకే



ఓటుముద్ర వేయించు. అప్పుడ్నీకూ సారా చుక్కా, పంటికిందికి ముక్కా, పచ్చకాయితం ... ఏదడిగితే అదిస్తారు. అదంతే! అలా నువ్వు తెలివి తెచ్చుకుంటే పెళ్లానికి ముక్కుపుడకేం కర్మ, ఏకంగా ముకుతాడు వేసిందానికి నాన్నతాడే వెయ్యెచ్చు. అదను పోతే ఆనక చేసేదేం వుండదు. ఆలోచించుకో!" అన్నాడు యంకటేశర్లు.

యంకటేశర్లు అంత ఇదిగా హితం కోరి జ్ఞానం చెప్తోన్నా యోహాను ధ్యాసమాత్రం అక్కళ్లేదు. బెంజిమన్ మీదికి మళ్లింది.

పాత జ్ఞాపకాలేవో గుర్తొచ్చి, పగలబడి నవ్వి "యంకటేశర్లుగోరూ! పోయిన్సారి జరిగిన నడమంతరం ఎలచ్చనప్పుడు పెద్దిరెడ్డిగోర్నీ, సాదరిగోర్నీ యంటేసుకొనొచ్చి, బెంజిమేనుగాడూ తఁవర్లాగానే అన్నాడు. అప్పుడ్నేను పాత టైరుకోసరం పట్నం ఎళ్లే ఉశార్లో వున్నా! ఆ యిసయమే వాళ్లకు సెప్పి ఎర్ర బస్సులో ఎళ్లిపోయాను. పొద్దుగాల్నే వొచ్చి సద్దొణ్ణం దింటుంటే అద్దరేత్తిరికాడ బెంజిమేను మాఁవొచ్చి బలవంతం సేసిండని సెప్పమన్నాడంట. నా ఆడది అట్టాగే సెప్పిందంతే, ఆరెతో వాణ్ణి సీల్సి సంపాలని అగ్గిరాముడ్నైనాను. తీరా ఆడికాడికెళ్లి ఇసారిత్తే ఏఁవుందాడ! వాడు సెప్పిన గురుతుకే ఓట్లెయ్యాలని బలవంతం సేసిండంట! ఛణంలో ఎంత గోరం జరిగేది? సదూకోన్నోనైతే అర్దం జేసుకోలేద్సరే, సదూకున్న ఆ నాకొడుకైనా సక్రంగా సెప్పొద్దూ...!" అన్నాడు.

యంకటేశర్లు కొంచెం తడబడ్డాడు! "నేను చెప్పిందాంట్లో పొరపాటేమైనా వుందా?" అని అడిగాడు ఆరెవేపే క్రీగంట చూస్తూ.

"పొరపాటంటే ... పొరపాటంటే యాఁవుందిలే! తఁవరికి తోసింది సెప్పారు. ఇంతకీ జరిగిందేటంటే బెంజిమేనుగాడి మాట్లు నమ్మి ఎలచ్చను పని ఎగబడి సేస్తిని. పొగులు సెప్పుల పనీ రేత్తిళ్లు ఓట్లపని! ఎలచ్చను దినాన గూడా పొద్దుగాల్నే వొచ్చి సింసెట్టుకాడే గూకుని సెప్పుల పని జేస్తుంటిని. నా అవుడియా అంతా నా దాని ముక్కుపుడక్కే! ఓట్ల కూల్లో తొక్కుంటూ, తోస్కుంటూనూ, బూతులబైట పోలీసులొచ్చి బాత్తే లగువెత్తుకుంటానూ బోల్డు ఉంగటాలు దెగుతయ్యని, వాట్ని రిపేరీ జేస్తే సిల్లరొస్తుందనీ, నాకాడ దాపెట్టుకున్న సిల్లరా, ఎలచ్చను దినం ఉంగటాల సిల్లరా గలిపి ముక్కుపుడక్కు తక్కువపడ్డ డబ్బు బెంజిమేనుగాడిత్తానన్నాడనీ పేరాశపడ్డాను.

"ఏంటి జరిగిందో తెల్సా యంకటేశర్లూ! బూతు పెట్టినెవుడో నూక్కొని పోయాట్ట. పోలీసోళ్లు కర్రల్తో బాత్తుంటే ఓటరు మహాచయులు లగువొత్తుతున్నారు. ఉంగటాలు దెగటం అటుంచి ఎలచ్చన్రోజు గూడా దుకానం బెట్టి కట్టం సేత్తావురా నా కొడకా! అంటూ బొచ్చెటోపీ పోలీసోడొచ్చి లాటీతో మోకాళ్లను కుల్లబొడిశాడు. లగువెత్తాను సూడూ ... లగువెత్తీ, లగువెత్తీ లగువెత్తి గసబోసుకుంటూ ఇంటికాడికెల్తే "ముక్కుపుడక దెచ్చావా?" అంది నా ఆడది. దాన్తప్పేంటీ లేదు! నిజ్జానికి బెంజిమేనుగాడి మాటల్నమ్మి దానికి ముక్కుపుడక గేపకం సేసింది నేనే!

దోతిని గజ్జల్లోకి లాంకుని మోకాళ్లు సూసుకుంటే ఏముంది? టమాటాల్లాగా దద్దుర్లు దేలి కాళ్లు వాసున్నాయి. ఏంటి జర్గిందో దానికి సెప్పంగానే ఏడ్నీల్ల కావడం పెట్టింది. ఏడ్సింది గూడా ...

యాడవమాకే ఇక నేన్జచ్చినా ఎలచ్చను రోజు కట్టం జెయ్యనంతే! అన్నాంకనే అది కళ్లు తుడుసుకుంది.

ఇంకా ఏంటి జరిగిందో తెల్సా యంకటేశర్లూ! సింసెట్టుకాడ్నించి లగువెత్తాను గదా ఆ లగువుతో దాని ముక్కుపుడక్కోసరం దాపెట్టుకున్న సిల్లరంతా బొడ్లోంచి యాడ జారిపోనాయో ఏంటో గాని సిల్లరన్నమాటే బొడ్లో లేదు. పొద్దుమీంకి ఎళ్లి సూద్దును గదా ... సింసెట్టుకాడ నా ఆరె, కంటాని, కాకిసంచి, గోనెవట్టా ఏవీ లేవు. ఇశారిత్తే ఇసయం దెల్సింది!

లోకల్ పోలీసోళ్లైతే పోన్లే యోహాన్దేగదాని ఇడ్సిపెట్టేవోళ్లేమో గాని మల్బార్ పోలీసులంట, ఆరె ఒకడూ, దారబ్బంతొకడూ, కంటానీ ఒకడూ ఎత్తకపోతూ కాకిసంచీనీ, గోనెపట్టానూ కాల్వలో నూకిపోయారంట!

జరిగిందంతా బెంజిమేనుగాడికి ఇడమర్సి సెప్పి ఎలచ్చను పని డబ్బులియ్యమంటే వాడు 'నేను మాత్తరం లగువెత్తలేదా ... మీకియ్యాల్సిన డబ్బులన్నీ ఆ లగువులోనే పోనాయి!' అన్నాడు మరి.

ఏం జేస్తాం! మళ్లీ ఆరె, కంటాని, దారబ్బంతి, కాకిసంచి గొనుక్కొందుకు శానా బాదైంది. ఆ బాదేంటికంటే నాదానికి ముక్కుపుడక సేయిచ్చలేదు గానీ, కాళ్ల పట్టీలూ అమ్మేను!" అని యోహాను అడుగులు అతికించిన చెప్పుల్ని యంకటేశర్లు కాళ్ల దగ్గర పెడుతూ, "ఇక నే జచ్చినా ఎలచ్చను పని సెయ్యను!" అన్నాడు.

యంకటేశర్లుకు పూరిండియన్సంటే అందుకే వల్లమాలిన కోపం! వాళ్లూ నూకాలని చూస్తారు. నూకినోడ్ని చూసి నిప్పులు పోసుకుంటారు. నూకలేకపోతే నీతి సూత్రాలు చెప్తారు. బెంజిమేనుగాడెంత, వాడు నొక్కేదెంత! ఆ విషయంలో పేదోళ్లకన్నా పెద్దోళ్లే నయం! వాళ్లు తప్పని సరైతేనే తప్ప స్కాముల్నీ పట్టించుకోరు. అలా తప్పనిసరై పట్టించుకున్నా విచారణ అంటూ మరికొన్ని కోట్లు కర్చు చేస్తారే కానీ నేరం రుజువైనా ఎవ్వరి దగ్గరా ఒక్క రూపాయి కూడా రికవరీ పెట్టరు.

యంకటేశర్లుకు అందుకే రిచ్చిండియన్స్ అంటే వల్లమాలిన అభిమానం!

యోహానులాంటి అజ్ఞానికి జ్ఞానం చెప్పే వీలు కనవడక తనదారిన తను చెప్పులు తొడుక్కుని వెళ్లిపోయాడు యంకటేశర్లు. ■

